
సాక్షి
బాపట్ల
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 563.30 అడుగుల వద్ద ఉంది. ఇది 240.1256 టీఎంసీలకు సమానంగా ఉంది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.0997 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కానుకగా బంగారు ఆభరణాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రూ.11 లక్షల విలువైన బంగారు కాసుల పేరు, తామర పుష్పాన్ని భక్తులు కానుకగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన నాదేళ్ల సుధారాణి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఈఈ కోటేశ్వరరావును కలిసి సుధారాణి పేరిట 178 గ్రాముల బంగారంతో తయారు చేయించిన కాసుల పేరును, 41 గ్రాముల బంగారంతో తయారు చేయించిన తామర పుష్పాన్ని చెన్నుపాటి కోటేశ్వరమ్మ పేరిట అమ్మవారికి కానుకగా సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు ప్రసాదాలు, శేషవస్త్రాలు, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

హైవే పనులను సమన్వయంతో నిర్వహించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో జాతీయ రహదారి (హైవే) పనులను అధికారులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. జాతీయ రహదారులకు సంబంధించి వివిధశాఖల అధికారులతో ఆయన సోమవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి -16కు అనుసంధానంగా పొట్టిపాడు నుంచి ఉయ్యూరు మీదుగా గుంటూరు జిల్లాలోని కాజ వరకు బైపాస్ రహదారి పనులను అధికారులు సమన్వయంతో చేపట్టాలన్నారు. విజయవాడ తూర్పు వైపు నిర్మించాల్సి ఉన్న ఈ బైపాస్ రహదారికి అధికారులు నాలుగు ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. ఈ రహదారిలో మద్దూరు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మించేలా ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.1200 నుంచి రూ.1500 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారని వివరించారు. భూసేకరణకు సుమారు రూ.400 కోట్లు అవసరమని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందని కలెక్టర్‌కు జాతీయ రహదారుల అధికారులు తెలిపారు. ఈ బైపాస్ రహదారి నిర్మాణం వల్ల ఎన్‌హెచ్ -16 పై విజయవాడ వద్ద ట్రాఫిక్ తగ్గించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచి ఈ రహదారి ప్రారంభమై గుంటూరు సమీపంలోని చిన కాకాని గ్రామం వద్ద ముగుస్తుందన్నారు. మొత్తం 49 కిలో మీటర్ల మేర ఈ రహదారిని నిర్మించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, తోట్లవల్లూరు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలు, గుంటూరు జిల్లాలో నాలుగు మండలాల మీదుగా ఈ రహదారి వెళ్తుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు ఐ.కిషోర్, పద్మావతి, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డి.వి.నారాయణ, డీపీఆర్ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యార్డుకు భారీగా మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 1,25,443 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ-నామ్ ద్వారా 1,06,811 బస్తాలు విక్రయాలు జరిగాయి. మిర్చి ధరలు ప్రస్తుతం స్థిరంగా ఉండటంతో రైతులు అమ్మకాలకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త సరుకు యార్డుకు ఇప్పుడిప్పుడే వస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కర్నూలు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి వచ్చే మిర్చి అంత నాణ్యతగా ఉండటం లేదు. తాలు ఎక్కువగా వస్తుంది. అందుకే రైతులు నిల్వ పెట్టడం కంటే అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. మరీ తడిగా ఉన్న మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారని, ఫలితంగా ధరలపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆరబెట్టి యార్డుకు తీసుకువస్తే ఆశించిన ధర వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 - రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 - రూ.24,500 వరకు పలికింది. తాలు రకం మిర్చి రూ.4,500 - రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,124 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

ఆధ్యాత్మిక పునరుజ్జీవం

దేవాలయాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంచి, మనిషికి మంచిని బోధిస్తూ, చెడువైపు వెళ్లనీయకుండా వారిలో భక్తిభావాన్ని నింపే నిలయాలు.. ఇంతటి ప్రాధాన్యమున్న ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. జిల్లాలో ఒక పక్క రూ.కోట్లు వెచ్చించి వంద ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేస్తూనే మరో పక్క ప్రతి గుడిలో నిత్యదీపారాధనకు ఆటంకాలు లేకుండా ధూప, దీప, నైవేద్యాలకు నిధులు విడుదల చేస్తుంది. అర్చకులు, సిబ్బంది జీవితాల్లో వెలుగులు నింపేలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తూ, జిల్లాలో ఆధ్యాత్మిక పునరుజ్జీవానికి ఇతోధిక సాయమందిస్తోంది.

- శిథిలావస్థకు చేరిన ఆలయాల జీర్ణోద్ధరణ
- కోట్లాది రూపాయలతో వంద ఆలయాల అభివృద్ధి
- 126 దేవాలయాలకు ధూప, దీప నైవేద్యాలకు నెలకు రూ.10.45 లక్షలు
- 89 మంది అర్చకుల వేతనాలకు నెలకు రూ.10.63 లక్షలు



రూ. 1.70 కోట్లతో పునర్నిర్మించిన కోవూరు రామలింగేశ్వరస్వామి దేవస్థానం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అర్హులైన వారికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించడంతోపాటు అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరోవైపు దేవాలయాల జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని శిథిలావస్థకు చేరిన దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుంది. ఇందుకోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది. అంతేకాకుండా ఆ శాఖలోని అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది.

దేవాలయాల జీర్ణోద్ధరణ పనులు..

జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన వందకు పైగా దేవాలయాల్లో ప్రభుత్వం జీర్ణోద్ధరణ పనులు చేయిస్తుంది . సీజీఎఫ్ నిధులతో పనులు చేపట్టారు. 30 శాతం మ్యాచింగ్ గ్రాంట్, 70 శాతం సీజీఎఫ్ నిధులను వెచ్చిస్తున్నారు. దేవదాయశాఖ ద్వారా ప్రస్తుతం దేవాలయాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఒక్కో దేవాలయానికి రూ.5కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి లోనూ దేవాలయాల జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి.

ధూప, దీప నైవేద్యాలు...

ధూప, దీప నైవేద్యం పథకం కింద ప్రభుత్వం దేవదాయ శాఖ ద్వారా నిధులను విడుదల చేస్తోంది. ఒక్కో దేవాలయానికి నెలకు రూ.5 వేలు చొప్పున 209 దేవాలయాలకు నెలకు రూ.10.45 లక్షలు ఖర్చు చేస్తుంది. నెలవారీ ఇచ్చే రూ.5 వేలలో రూ.2 వేలు నైవేద్యం, దీపారాధనకు మిగిలిన రూ.3 వేలు అర్చకుడికి ఇస్తున్నారు.

అర్చకులకు జీతాలు...

ఆలయాల్లో పౌరోహిత్యం నిర్వహిస్తున్న అర్చకులకు ప్రభుత్వం నెలవారీ జీతాలు చెల్లిస్తుంది. ఇందులో 50 మందికి నెలకు రూ.10 వేల చొప్పున, 36 మందికి నెలకు రూ.15,625 చొప్పున చెల్లిస్తుంది. ఈ లెక్కన జీతభత్యాల కింద నెలకు రూ.10,62,500 లు ప్రభుత్వం చెల్లిస్తుంది.

అర్చకులు, సిబ్బందికి ఇళ్ల స్థలాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్చకులు, చిరు ఉద్యోగులు, సిబ్బందికి ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కొక్కరికి 100 గజాల స్థలం ఇవ్వనున్నారు. తొలుత 225 మందికి స్థలాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

ఉద్యోగులు, సిబ్బందికి పలు రకాల లబ్ధి..

దేవదాయశాఖ పరిధిలో పూజారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వం పలు రకాల లబ్ధి కల్పిస్తోంది. ప్రధానంగా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు రుణం మంజూరు చేస్తుంది. దీంతో పాటు వివాహానికి రూ.లక్ష, ఉపనయనంకు రూ.25 వేలు, విద్యకు అవసరమైన మేర, ఉద్యోగ విరమణ అనంతరం (గ్రాట్యుటీ) రూ.4 లక్షలు ఇతర బెనిఫిట్స్ అందుతాయి.

ఆలయాల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



ఆలయాల అభివృద్ధి తోపాటు ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రస్తుతం వందకు పైగా శిథిలావస్థకు చేరిన ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేస్తున్నాం. ధూప, దీప, నైవేద్యం ద్వారా అన్ని ఆలయాలకు నిధులు ఇవ్వడం తోపాటు, అర్చకులకు వేతనాలు ఇవ్వడమే కాక ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది.

– ఎం. పానకాలరావు, జిల్లా ఎండోమెంట్ అధికారి

జిల్లాలోని దేవదాయ శాఖ పరిధిలోని దేవాలయాలు..

జిల్లాలో మొత్తం దేవాలయాలు	: 1087
అసిస్టెంట్ కమిషనర్ పరిధిలో ఉన్న ఆలయం (శింగరకొండ, రూ.4 కోట్ల ఆదాయం)	: 1
రూ.25 లక్షలకు పైగా ఆదాయం ఉన్నవి (6ఎ)	: 2
రూ.2లక్షల నుంచి 25 లక్షలు లోపు ఆదాయం ఉన్నవి (6బి)	: 88
రూ.2 లక్షల లోపు ఆదాయం ఉన్నవి (6సి)	: 996

నకిలీ న్యాయవాదులకు ముందస్తు బెయిల్ తిరస్కరణ

గుంటూరు లీగల్: నకిలీ న్యాయవాదుల ముందస్తు బెయిల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి సోమవారం తిరస్కరించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన బెక్కి నాగేశ్వరరావు, మార్చేర్ల వెంకటేశ్వరరావు బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో ఉన్న మంకథ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ సర్టిఫికెట్ పొందారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా నమోదయ్యారు. అనంతరం సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఏపీ బార్ కౌన్సిల్ ఇటీవల చేపట్టిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది నకిలీ లా డిగ్రీ సర్టిఫికెట్లతో ఏపీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకుని న్యాయవాదులుగా చలామణి అవుతున్నట్లు గుర్తించారు. వారి పేర్లుతో సహా ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత ఇటీవల తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందులో మొదటి, రెండో ముద్దాయిలుగా ఉన్న నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని జిల్లా కోర్టులో పిటీషన్ దాఖలు చేసుకున్నారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. తాము నిర్దోషులమని నిందితులు వాదనలు వినిపించారు. పోలీసుల ఇన్విస్టిగేషన్ జరుగుతున్న నేపథ్యంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయకూడదని జిల్లా కోర్టు పీపీ మహమ్మద్ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదించారు. ఈ క్రమంలో నిందితులకు ముందస్తు బెయిల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి తిరస్కరించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2900, గరిష్ఠ ధర రూ.3600, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.

మలి సంధ్యలో విషాద గీతిక

తమ కళ్ల ముందే తామెంతో గారాబంగా పెంచి, పెద్దచేసిన కుమారుడు అనారోగ్యంతో మంచానపడి మరణించడాన్ని తట్టుకోలేని ఆ ముదుసలి హృదయాలకు ఎదిగొచ్చిన మనమడు ఆత్మహత్య చేసుకోవడం మరింత మానని గాయమై కుంగదీసింది.. తీపి జ్ఞాపకాల దొంతరలో గడిచిపోవాల్సిన వార్ధక్యం ఇలా వరుస విషాదాలతో నిండిపోవడం ఆ వృద్ధ జంట తట్టుకోలేక పోయింది. కోడలి తీవ్ర అనారోగ్యం.. ఆర్థిక సమస్యలు.. మరో కుమారుడు దూరంగా ఉండడం వంటి ఘటనలతో తమ జీవిత ప్రయాణమనే నావ దరి దాపులో కాంతి పుంజం కనిపించక, చుట్టూ చీకటి అలుముకున్నట్లు అగుపించడంతో ఆ ప్రయాణానికి బలవంతంగా ముగింపు పలికారు. మరణంలోనూ ఒక్కటిగానే ముందుకుసాగారు.

- దమ్మాలపాడులో వృద్ధ దంపతులు ఆత్మహత్య
- కుటుంబానికి భారం కాకూడదనే తీవ్ర మనస్తాపం



ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధ దంపతులు వెంకటేశ్వర్లు, సామ్రాజ్యంలు(ఫైల్)

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): విధి ఆ కుటుంబం పాలిట శాపమైంది. ఒకప్పుడు బాగా బతికి.. నేడు పూట గడవటానికి కూడా చేతులు చాపాల్సి వస్తుందేమో అనే మనస్తాపం వారిని మరింత వేదనకు గురి చేసింది. ఎవరికీ భారంగా మారకూడదని కూడబలుక్కొన్న ఆ వృద్ధ దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన అన్నెంవెంకటేశ్వర్లు(71), సామ్రాజ్యం(62)లకు ముగ్గురు సంతానం . ఇద్దరు కుమారులు కాగా, ఒక కుమార్తె ఉంది. గతంలో అందరిలాగే తనకున్న ఎకరన్నర సొంత భూమితో పాటుగా మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వెంకటేశ్వర్లు బాగా వ్యవసాయం చేసేవాడు. అందరికీ పెళ్లిల్లు చేసి, తాను కట్టుకున్న పక్కాగృహంలోనే నివాసం ఉంటున్నారు. వయోభారంతో ఇంటికే పరిమితం అయ్యారు. ఈ క్రమంలో గత రెండేళ్ల క్రితం పెద్ద కుమారుడు మస్తాన్‌రావు కిడ్నీలు పాడవటంతో కోడలు బాలమ్మ కిడ్నీ దానం చేసింది. సుమారు రూ.18లక్షల వరకు ఖర్చయింది. మస్తాన్‌రావు వాటా కింద వచ్చిన అర ఎకరం పొలం అమ్మి కొంత మేర అప్పులు తీర్చారు. అయినప్పటికీ మస్తాన్‌రావు మృతి చెందాడు. పెద్ద కొడుకు మృతి చెందటంతో వెంకటేశ్వర్లు, సామ్రాజ్యంలు పెద్ద కోడలు వద్దే ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో మస్తాన్‌రావు పెద్ద కొడుకు ప్రసాద్ కూడా నరసరావుపేటలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్ద కోడలు కూడా భర్తకు కిడ్నీ దానం చేయటంతో తరచూ అనారోగ్యానికి గురవుతూ ఉండటంతో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. వెంకటేశ్వర్లు, సామ్రాజ్యంల చిన్న కొడుకు వెంకట్రావు నరసరావుపేట వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు.

వృద్ధాప్య పింఛనే ఆధారం....

వెంకటేశ్వర్లు, సామ్రాజ్యంలకు ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ సాయమే ఆధారంగా మారింది. కూలి పనులకు వెళితే తప్ప ఇల్లు గడవని పరిస్థితి. ఒక వైపు పెద్దకోడలి ఆరోగ్యం అంతంత మాత్రం కావటం, చిన్న మనవడి చదువు నిలిచి పోయే పరిస్థితిని చూసి వృద్ధ దంపతులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. కుటుంబానికి భారం కాకూడదని భావించి పొలానికి తెచ్చుకున్న పురుగుమందు తాగి ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెల్లవారే సరికే ఇరువురు మృత్యువాత పడ్డారు.

చివరి మజిలీలోను....

వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం దంపతులు పెళ్లయిన నాటినుంచే అన్యోన్యంగా ఉంటూ అందరికీ ఆదర్శంగా ఉండేవారని గ్రామస్తులు చెబుతున్నారు. వ్యవసాయ పనులతో పాటుగా ఏ పని చేసినా కూడా ఇద్దరూ కలిసే చేస్తారని స్థానికులు చెబుతున్నారు. చివరి మజిలీలోను కలిసే మృతి చెందటం వారి అన్యోన్య దాంపత్యానికి నిదర్శనంగా గ్రామస్తులు చెప్పుకొంటున్నారు. వృద్ధులైన దంపతులు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాలకు శవ పంచనామా నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు.

పిల్లలకు ఉరివేసి తల్లి ఆత్మహత్య

- క్షణికావేశంలో మహిళ ఘాతుకం
- సంఘటనలో ముగ్గురు మృతి
- మరో మహిళతో భర్త సహజీవనమే ఘటనకు కారణం



దొండేటి శివలింగేశ్వరి, చరణ్‌సాయిరెడ్డి, జతిన్‌రెడ్డి మృతదేహాలు

నరసరావుపేటటౌన్: ఇద్దరు పిల్లలకు ఉరివేసి ఆపై తల్లి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం నరసరావుపేట పట్టణంలో చోటుచేసుకుంది. తన కుమార్తె మరణానికి ఆమె భర్త వేధింపులే కారణమంటూ మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్ర బాబు తెలిపారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం వెలంరాజుపల్లి గ్రామానికి చెందిన దొండేటి ఇంద్రసేనారెడ్డికి రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామానికి చెందిన శివలింగేశ్వరి(27)తో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. స్థానిక పెద్దచెరువు మహాలక్ష్మమ్మ నగర్‌లో ఏడేళ్లుగా వీరు నివాసం ఉంటున్నారు. వీరికి చరణ్ సాయి రెడ్డి(6), జతిన్ రెడ్డి(4) సంతానం ఉన్నారు. పెద్ద కుమారుడు రెండో తరగతి, రెండోవాడు నర్సరీ చదువుతున్నారు. ఇంద్రసేనారెడ్డి గుంటూరు రోడ్డులో ట్రాక్టర్ మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. శివలింగేశ్వరి మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌లో టైలరింగ్ పనికి వెళ్తుంది. మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తరచూ మద్యం తాగి భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయమై కొంతకాలంగా భార్యాభర్తల మధ్య వివాదం కొనసాగుతుంది. భర్త వేధిస్తున్నాడని వారితో కలసి అదే ఇంట్లో ఉంటున్న అత్తమామలకు పలుమార్లు చెప్పినా వారు పట్టించుకోలేదు. ఈక్రమంలో సోమవారం ఉదయం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. పిల్లలను పాఠశాలలో విడిచి పెట్టాలని భర్తను కోరగా పట్టించుకోకుండా వెళ్లాడు. మామ నారాయణరెడ్డిని పిల్లలను స్కూల్‌కు తీసుకువెళ్లాలని కోరగా అతను పని ఉందని వెళ్లిపోయాడు. ఈక్రమంలో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మామ నారాయణరెడ్డి ఇంటికి వచ్చి చూడగా తలుపులకు లోపల నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా ఫ్యానుకు ఉరివేసుకొని పిల్లలిద్దరూ వేలాడుతూ కనిపించారు. చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా అప్పటికే చిన్నారులిద్దరూ మృతి చెంది ఉన్నారు. మరో రూమ్‌లో శివలింగేశ్వరి ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. ఆమెను కిందకు దించి పరిశీలించగా మృతి చెందినట్టు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సీఐ వీరేంద్రబాబు, ఎస్‌ఐ షేక్ రహంతుల్లా సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ విజయభాస్కరరావు మార్చ్యురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. ఈ మేరకు మృతురాలి తల్లి ద్రాక్షాయని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. భర్త ఇంద్రసేనారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మిర్చి రైతుల ఆకలి తీర్చేలా..

- యార్డులో ఉచిత భోజన పథకం ప్రారంభం
- ఈ ఏడాది రూ.10 వేల కోట్ల వ్యాపారం చేసే అవకాశం
- మిర్చి యార్డు ఛైర్మన్ ఏసురత్నం



భోజనం నాణ్యతను రైతులను అడిగి తెలుసుకుంటున్న యార్డు ఛైర్మన్ చంద్రగిరి ఏసురత్నం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సోమవారం యార్డు ఛైర్మన్ చంద్రగిరి ఏసురత్నం ప్రారంభించారు. రైతులకు స్వయంగా ఆయన భోజనం వడ్డించి, భోజనం, రుచులను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఏసురత్నం మాట్లాడుతూ రైతులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించడం జరిగిందన్నారు. రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రైతులు నేరుగా యార్డుకు తమ సరుకును తీసుకువచ్చి విక్రయించుకుంటే మంచి ధర వస్తుందని, దళారులను నమ్మడం వల్ల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులకు అన్ని విధాలుగా మేలు చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని స్పష్టం చేశారు. గత మూడేళ్లుగా ఇంటర్నేషనల్ మార్కెట్, డొమెస్టిక్ మార్కెట్‌లలో ధరలు ఆశించిన మేర ఉండటంతో రైతుకు మంచి ధరలు లభిస్తున్నాయని తెలిపారు. గత ఏడాది మిర్చి సీజన్‌లో రూ.8,500 కోట్ల వ్యాపారం చేయడం జరిగిందని, యార్డు పాలకవర్గం, అధికారుల సమన్వయంతో ఈ ఏడాది రూ.10 వేల కోట్ల వ్యాపారం చేసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసం నుంచి యార్డుకు భారీస్థాయిలో మిర్చి వస్తుంటుందని, కానీ ఈ ఏడాది జనవరి ప్రారంభం నుంచే భారీస్థాయిలో యార్డుకు రైతులు మిర్చి బస్తాలను తరలిస్తున్నారన్నారు. మిర్చి ధరలు కూడా ఆశించిన స్థాయిలో ఉండటంతో రైతులు తాము పండించిన పంటలను యార్డుకు తరలించి విక్రయించుకుంటున్నారని తెలిపారు. గుంటూరు మార్కెట్ యార్డును ప్రపంచంలోనే అత్యుత్తమ మార్కెట్ యార్డుగా తీర్చిదిద్దేందుకు తమ పాలకవర్గం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. యార్డు వైస్ ఛైర్మన్ సుధాకరరెడ్డి, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

• బోనమెత్తిన భక్తజనం

పెనుగంచిప్రోలులో వేంచేసియున్న తిరుపతమ్మవారి పెద్ద తిరునాళ్ల రెండో రోజు సోమవారం కొనసాగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పాలు, పొంగళ్లతో బోనాలు సమర్పించారు. దీక్ష విరమించిన స్వాములు తెల్లవారుజామునే మునేరులో స్నానమాచరించి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ఆదివారం రాత్రి కల్యాణం అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో గ్రామంలోని ఆలయాల్లో, ఇసుక తిన్నెల మీద సేదదీరారు.

– పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట)



అమ్మవారికి పొంగళ్లు చేస్తున్న భక్తులు

అర్జీల పరిష్కారమే లక్ష్యం కావాలి

స్పందనలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



వృద్ధ దంపతుల నుంచి అర్జి స్వీకరించి, వారి సమస్యను వింటున్న కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల అర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. అధికారులు తప్పనిసరిగా గురువారం గ్రామాల్లో పర్యటించాలన్నారు. శనివారం జగనన్న లే -అవుట్‌లను పరిశీలించాలన్నారు. అనంతరం ఇంటింటికి మునగ మొక్కలు పంపిణీ కార్యక్రమం కింద జిల్లా అధికారులకు కలెక్టర్ మునగ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివజ్యోతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, పౌర సరఫరాల శాఖ డీఎం శ్రీలక్ష్మి, డీఎస్‌ఓ విలీమ్స్, తదితరులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన కొన్ని అర్జీలు...

స్థలం ఇచ్చారు.. పట్టాలిప్పించండి

మాకు స్థలం ఇచ్చారు కానీ ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు. పలు మార్లు అధికారులను వేడుకున్నా ఫలితం లేదు. న్యాయం చేయండి.

– చౌటీపాలెం గ్రామస్తులు, బాపట్ల జిల్లా

కన్న కుమార్తె మోసం చేసింది

మా మూడో కుమార్తె రమాదేవి మా నాలుగు ఎకరాల భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో తన పేరుతో నమోదు చేయించుకుంది. మాకు తెలియకుండా ఆన్‌లైన్‌లో భూమిని తన పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించుకుంది. పరిశీలించి న్యాయం చేయగలరు.

– హనుమంతరావు, దాక్షాయణి వృద్ధ దంపతులు, గుణపపూడి

మా స్థలాన్ని చూపించండి

మాకు 1979లో ప్రభుత్వం సర్వే నంబర్1070/35 లో 75 సెంట్లు భూమిని సాగు చేసుకోవడానికి ఇచ్చారు. గత 30 సంవత్సరాల నుంచి భూమి చూపించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ఫలితం లేదు. మాకు భూమిని చూపించాలని కోరుతున్నాం.

– బాపనపల్లి సూర్యనారాయణ, పెదగంజాం

స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదేపదే పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదన్నారు. పోలీస్ అధికారులే స్వయంగా బాధితుల వద్దకు వెళ్ళి ఆ ప్రదేశంలో విచారించి సకాలంలో చట్టపరిధిలో ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన ఇన్‌స్పెక్టర్ వి. మాల కొండయ్య పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు కేజీబీవీ బాలికలు


జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన బాలికలు

చినగంజాం: జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయ బాలికలు ఇద్దరు ఎంపికైనట్లు చినగంజాం కేజీబీవీ స్పెషలాఫీసర్ సుమాంజలి తెలిపారు. పాఠశాల ఆవరణలో ఎంపికైన బాలికల అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ అంతర్‌జిల్లాల అథ్లెటిక్స్ మీట్ బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈనెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. మీట్‌కు సంబంధించి గత నెల 27వ తేదీ చినగంజాంలో నిర్వహించిన జిల్లా మీట్‌లో బాలికల ఎంపిక జరిగినట్లు తెలిపారు. ఎంపికైన వారిలో విద్యాలయానికి చెందిన 10వ తరగతి చదువుతున్న పీ శ్రీలక్ష్మి అండర్-16 కేటగిరిలో షాట్‌పుట్, లాంగ్‌జంప్, 60 మీటర్లు, 7వ తరగతి చదువుతున్న పీ మనిషా అండర్-14 కేటగిరీలో ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని వారికి సూచించారు. ఎంపికైన బాలికలను ఆమెతో పాటు పీఈటీ ఎస్ వాణిశ్రీ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

హైస్కూల్‌లో సిక్ రూం ఏర్పాటు వినూత్న ఆలోచన


మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

చీరాల అర్బన్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల కోసం సిక్ రూం ఏర్పాటు చేయడం వినూత్న ఆలోచన అని ఎమ్మెల్సీ పి.కల్పలతారెడ్డి అన్నారు. సోమవారం చీరాల మండలం ఈపూరుపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆమె పరిశీలించారు. హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లును ప్రశంసించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి మెనూ ప్రకారం నిర్వహణ జరుగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థినులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని పలు సూచనలు చేశారు. అలానే పాఠశాల ఆవరణలోని జాతీయ నాయకుల విగ్రహాలను పూలమాలలతో అలంకరించారు.

ఆధార్ సవరణల ప్రక్రియ పకడ్బందీగా ఉండాలి

కలెక్టర్ విజయకృష్ణన్


ఆధార్ అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఆధార్ పర్యవేక్షణ కమిటీ సభ్యులు

బాపట్ల అర్బన్: ఆధార్ సవరణల ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఆధార్ పర్యవేక్షణ కమిటీ తొలి సమావేశం సోమవారం నిర్వహించారు. ఆధార్ సవరణల మార్గదర్శకాలపై రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్‌లో పుట్టినరోజు, చిరునామాలు ధ్రువీకరణ లేకుండా సవరించే ప్రక్రియను అధికారులు అరికట్టాలని కోరారు. చిన్నారుల ఆధార్ కార్డులు సవరణ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల ఆధార్‌కు అప్‌డేట్‌కు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు 36 శాతం కాలేదని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు ఒకసారి, 15 సంవత్సరాలకు ఒకసారి చిన్నారుల ఆధార్ కార్డులను విధిగా సవరణ చేయాలని చెప్పారు. శిబిరాలు ఏ ప్రాంతాల్లో నిర్వహిస్తారో సంబంధిత పాఠశాలల వివరాల జాబితాను అధికారికంగా ప్రకటించాలని ఆదేశించారు. ఆధార్ కోసం తప్పనిసరిగా వేలిముద్రలతో పాటు ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను వెంట తెచ్చుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా 477 సచివాలయాలు ఉండగా, 5:1 నిష్పత్తి ప్రకారం ఆధార్ కేంద్రాలు జిల్లాలో ఉండాలన్నారు. ప్రస్తుతం 57 వార్డు సచివాలయాలలో ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని చెప్పారు. మరో 39 సచివాలయాలలో ఆధార్ కేంద్రాలను మూడు రోజుల్లో ప్రారంభించాలన్నారు. పోస్టాఫీసుల్లో మరో 12 ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. ఆధార్ కార్డుల కోసం సేవా రుసుం రూ.100 మించి వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రులలో గర్భిణులు ప్రసూతి సమయంలో శిశువులకు ఆధార్ నమోదు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా స్థాయి కమిటీలో సభ్యులుగా ఉన్న అధికారులు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ డీఆర్‌ఓ కె.లక్ష్మీ శివజ్యోతి, కమిటీ సభ్యులు అదనపు ఎస్పీ మహేష్, ఆధార్ రీజనల్ ఆఫీసర్ సుశీల్ కుమార్, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ బాబు, శిశు ఆధార్ కో ఆర్డినేటర్ వందనం, డీపీఓ వై.శంకరనాయక్, డీఆర్‌డీఏ పీడీ బీ అర్జునరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి విజయమ్మ పాల్గొన్నారు.

జీడిపప్పు వ్యాపారి అదృశ్యం



వేటపాలెం: స్థానిక జీడిపప్పు వ్యాపారి ఆత్మకూరి సుధాకర్ అదృశ్యంపై కేసు నమోదైంది. కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే సదరు వ్యాపారి వ్యాపారం కోసం కోట్ల రూపాయలు అప్పులు చేసినట్లు సమాచారం. జీడిపప్పు షాపుకి తాళాలు వేసి వెళ్లిన సుధాకర్ రెండు రోజులుగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఈ వ్యాపారికి అప్పులు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు.

లైంగిక వేధింపుల కేసులో వ్యక్తికి రిమాండ్

కారంచేడు: కోడలిని లైంగికంగా వేధించిన కేసులో మామకు కోర్టు రిమాండ్ విధించింది. ఎస్‌ఐ ఎం.అనిత అందించిన వివరాలు.. మండల కేంద్రం కారంచేడు రామాలయ బజారుకు చెందిన రాయనీడి సీతారామయ్య కోడలిని లైంగికంగా వేధిస్తుండటంతో కోడలు ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడిగా ఉన్న సీతారామయ్యను సోమవారం అరెస్ట్ చేసి పర్చూరు కోర్టుకు హాజరుపరచగా ఈ నెల 20వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



గోరంట్ల: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం బెల్లాచెరువు సమీపంలో నందిని వేర్‌హౌస్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. బాపట్ల జిల్లా జంపని గ్రామానికి చెందిన వెల్డర్ హరికృష్ణ (33) సోమవారం ఉదయం గోదాము పైకప్పు రేకులు బిగించే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో డ్రిల్ మిషన్‌తో రేకులు బిగిస్తుండగా మిషన్‌కున్న వైర్ తెగి రేకులకు విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

సివిల్ సప్లయిస్ డీటీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చేబ్రోలు: పౌరసరఫరాలశాఖ డెప్యూటీ తహసీల్దారు రేషన్ డీలర్ల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని పాతరెడ్డిపాలేనికి చెందిన డీలర్ పులి సుభాషిణి, జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సీఎస్ డీటీ భువనేశ్వరి ప్రతి నెలా డీలర్ల వద్ద మాములు వసూళ్లకు చేబ్రోలుకు చెందిన డీలర్ల అసోసియేషన్ నాయకుడిని ఎంపిక చేసుకున్నారన్నారు. మాములు ఇవ్వలేదనే కారణంతో తన డీలర్ షిప్‌ను రద్దు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని డీలరు పులి సుభాషిణి కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

సెలవు మంజూరుకు భారీ లంచం

వాట్సాప్ గ్రూపుల్లో బాధితుడు ఆరోపణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సెలవు మంజూరుకు పెద్ద మొత్తంలో లంచాలు అడుగుతున్నారంటూ వైద్య ఉద్యోగి, ఏపీ ఎన్జీవో నాయకుడు సోమవారం వాట్సాప్ గ్రూపు వేదికగా ఆరోపణలు చేశాడు. తన బంధువు హెడ్ నర్సుగా పనిచేస్తూ ప్రభుత్వ అనుమతి తీసుకుని అమెరికా వెళ్లగా, ఆమెకు సెలవు మంజూరుకు భారీ స్థాయిలో డబ్బులు అడిగి ఇవ్వకపోవడం వలన మంజూరు చేయకుండా తిప్పుతున్నారంటూ ఆరోపించారు. ప్రతి పనికి కార్యాలయంలో డబ్బులు ఇస్తేనే పనులు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వకపోతే నరకం చూపిస్తూ దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్నారని వాపోయారు. ఏపీ ఎన్జీవో నాయకులు తనకు న్యాయం చేయాలంటూ వాట్సాప్ గ్రూపు ద్వారా కోరారు. కాగా ఈ విషయంపై గుంటూరు ఆర్డీ డాక్టర్ జొన్న లగడ్డ యాస్మిన్‌ను వివరణ కోరగా, నిబంధనల ప్రకారం సెలవు మంజూరు చేస్తామన్నారు. సెలవు మంజూరుకు భారీ స్థాయిలో మామూళ్లు అడిగినట్లు వస్తున్న ఆరోపణలు పూర్తి నిరాధారమైనవని చెప్పారు. నిజంగా సిబ్బంది డబ్బులు అడిగినట్లు తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదే విషయాన్ని తనను కలిసిన ఏపీ ఎన్జీవో నేతలకు కూడా తెలియజేశానని వెల్లడించారు.

మృతి చెందిన ఉద్యోగి భార్యకు సచివాలయ ఉద్యోగం


నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో తొలిసారిగా గ్రామ సచివాలయంలో ఉద్యోగిగా విధుల్లో ఉంటూ ఆకస్మికంగా చనిపోయిన ఉద్యోగి భార్య కరిష్మాకు ఉద్యోగం కేటాయించి కలెక్టర్ ఎల్.శివశంకర్ మానవత్వాన్ని చాటుకున్నారు. బెల్లంకొండ మండలం వన్నాయపాలెం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షేక్ సద్దాం హుస్సేన్ గత ఏడాది జనవరి తొమ్మిదిన మృతి చెందాడు. ఆయన భార్య అదే ఏడాది జూలైలో జిల్లా కలెక్టరేట్‌లో కారుణ్య నియామకం ద్వారా తనకు సచివాలయంలో ఉద్యోగం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ శివశంకర్ డిసెంబరులో బాధితురాలికి మాచర్ల మండలం రాయవరం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కరిష్మాకి కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం పాల్గొన్నారు.

కృష్ణా నదిలో ఇద్దరు బిడ్డలతో దూకిన తల్లి

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న కృష్ణానదిలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ తల్లి ఇద్దరు బిడ్డలతో కలసి దూకి ఆత్మహత్యకు పాల్పడగా అక్కడే ఉన్న జాలర్లు ప్రాణాలకు తెగించి కాపాడిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సయ్యద్ షమీర్ బాష తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన పేర్ల శ్రీను, మల్లేశ్వరి దంపతులకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన మల్లేశ్వరి తన 4, 3 సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు పిల్లల్ని తీసుకుని సత్రశాల వద్ద కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సమయంలో సమీపంలో చేపలు పడుతున్న జాలర్లు నూకరాజు, శ్రీను, వెంకటేష్ తల్లీబిడ్డలు నదిలో దూకడం గమనించి తమ మరబోటు సహాయంతో వారిని కాపాడినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డలను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ క్షేమంగా ఉన్నారని ఆయన చెప్పారు.

ప్రభుత్వంపై ఎల్లో మీడియా విషప్రచారం తగదు

ఎమ్మెల్సీ పోతుల సునీత



చీరాల: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై పచ్చ మీడియా విషప్రచారాన్ని కొనసాగిస్తోందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి ఆమె తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీకి కొమ్ముకాస్తున్న ఎల్లో మీడియా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కాలం నుంచి విషపురాతలు రాస్తూనే ఉందన్నారు. బీసీ కార్పొరేషన్లు అన్నీ ఖాళీ అంటూ విషపురాతలు రాశారన్నారు. మూడున్నర కాలంలో నవరత్నాల పథకాలను తీసుకువచ్చి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం మేర పూర్తి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. బీసీలను అన్ని రంగాలలో గౌరవించాలని సామాజికంగా, రాజకీయంగా రాణించేందుకు 136 బీసీ కులాలుంటే 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందని ప్రశ్నించారు. బీసీలను అవమానించిన చంద్రబాబు గురించి ఆనాడు పత్రికల్లో ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం బీసీలకు రూ.19 వేల కోట్లు ఖర్చు చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక 1.62 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ఏఎన్‌యూ విద్యార్థి


అథ్లెట్‌ను సన్మానిస్తున్న వీసీ రాజశేఖర్, పక్కన రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడు పతకాలు సాధించిన ఏఎన్‌యూ అథ్లెట్ వి.భాస్కరరావును సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అభినందించారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పోటీలలో యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల గ్రామీణాభివృద్ధి విభాగ విద్యార్థి, అథ్లెట్ భాస్కరరావు లాంగ్‌జంప్‌లో బంగారు పతకం, 400 మీటర్ల పరుగులో రజిత పతకం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడు. త్వరలో పూణెలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పారా ఒలంపిక్స్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భాస్కరరావు జాతీయ స్థాయి పోటీలలో కూడా మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పి.జాన్సన్, గ్రామీణాభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ వి.దివ్యతేజోమూర్తి పాల్గొన్నారు.

బంగారం మాయంపై బ్యాంక్‌కు తాళం

- రెంటపాళ్లలో యూనియన్ బ్యాంక్ ముందు బైఠాయించిన రైతులు
- పోలీసులు రంగప్రవేశం చేసి చర్చలు
- ఈ నెల 7న హామీ పత్రాలు ఇస్తామని బ్యాంక్ అధికారుల ప్రకటన
- ఆందోళనను తాత్కాలికంగా విరమించిన వైనం


బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కుదవ పెట్టిన రైతుల బంగారం మాయమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం రుణగ్రహీతలైన రైతులు బంగారం తమకు ఇవ్వాలంటూ రెంటపాళ్ల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తాళాలు వేసి ముందు బైఠాయించారు. బంగారం ఎప్పుడు ఇస్తారో స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. బ్యాంకు కార్యకలాపాలు జరగకుండా తాళాలు వేసి అడ్డుకోవడంతో సత్తెనపల్లి రూరల్ ఎస్‌ఐ ఆవుల బాలకృష్ణ నేతృత్వంలో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఇటు రుణ గ్రహీతలతో, అటు బ్యాంక్ అధికారులతో చర్చించారు. బ్యాంక్‌లపై ఎంతో నమ్మకంతో తాము బంగారం కుదవ పెట్టి పొలం పనులకు రుణాలు పొందామని, బ్యాంకుల్లోనే లూటీ చేస్తే ఏం చేయాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తాము ఎలాంటి ఆందోళన చేయలేదని, 49 మంది రైతుల బంగారం మాయమైనట్లు అధికారులు ప్రకటించారని, ఆ బంగారం ఏ రూపంలో ఎప్పుడు ఎలా ఇస్తారో చెప్పాలని పట్టుబట్టారు. అప్పటివరకు తాము బ్యాంకు తాళాలు తీయనిచ్చే ప్రసక్తే లేదన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయమని బ్యాంక్ అధికారులు చెబితే అక్కడ కూడా ఫిర్యాదు చేశామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో బ్యాంక్ జోనల్ అధికారులు బాధితులు అందరికీ హామీ పత్రాలు ఈ నెల ఏడున సాయంత్రం లోపు అందజేస్తామని తెలిపారు. రుణగ్రహీతలకు అన్యాయం జరగదని, పరిష్కారం చూపుతామని ప్రకటించడంతో బ్యాంక్ అధికారులకు తాళాలు అందజేసి ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. అనంతరం బ్యాంక్ అధికారులు బ్యాంక్ తెరిచి తమ విధుల్లో నిమగ్నమయ్యారు.

ఇప్పటికే ఇరువురు అరెస్ట్

రెంటపాళ్ల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బంగారం మాయం వ్యవహారంలో ఇప్పటికే బ్యాంక్ మేనేజర్ రాంబాబు నాయక్, గోల్డ్ అప్రైజర్ ఇమ్మిడిశెట్టి సంపత్ కుమార్‌ను సత్తెనపల్లి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం 49 మంది రైతులకు చెందిన బంగారు సంచులు మాయమైన విషయం బ్యాంక్ అధికారులు ఇటీవల ప్రకటించారు. కాగా విచారణలో 41 మంది రైతులకు చెందిన బంగారు సంచులు, ఒక పేరు రెండుగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ వ్యవహారంలో బ్యాంకు మేనేజర్, గోల్డ్ అప్రైజర్ రూ.1.52 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. ఇందులో మరికొందరి ప్రమేయంపై కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. రైతులు బంగారం కుదవ పెట్టి నగదు తీసుకొని తిరిగి రుణం చెల్లించిన వారికి ప్రస్తుత మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం నగదు చెల్లింపులు చేయనున్నారు. రుణం చెల్లించని వారికి తీసుకున్న రుణం పోనూ మిగిలిన మొత్తం చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని నుదురుపాడు శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. గురజాల మండలం గోగులపాడుకు చెందిన కరుణాకరరెడ్డి, దొనకొండ మండలం చందవరానికి చెందిన రవిచంద్రారెడ్డి గుంటూరులోని ఓ ప్రయివేటు కళాశాలలో చదువుతున్నారు. ఉదయం గుంటూరు నుంచి ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వెళ్తుండగా నుదురుపాడు గ్రామశివారులోని ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో కరుణాకరరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా రవిచంద్రారెడ్డికి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నరసరావుపేటకు 108లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కబడ్డీ ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక

బాపట్ల అర్బన్: కబడ్డీ ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్- 19 బాలబాలికల జట్ల ఎంపిక సోమవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈనెల 10, 11 తేదీల్లో విజయనగరం జిల్లాలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పీడీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన జట్లను సరస్వతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వేదవతి అభినందించారు. కార్యక్రమంలో పీడీలు కత్తి శ్రీనివాసరావు, ఉదయ్‌భాస్కర్, కోటేశ్వరమ్మ, డి.శైలజ, వై.సాంబశివరావు, టి.సాంబశివరావు పాల్గొన్నారు.


ఎంపికైన బాలుర జట్టు


ఎంపికైన బాలికల జట్టు